క్లుప్తంగా

గ్రామాల్లో గులాబీ జెండాలు ఎగురవేద్దాం

- రజతోత్సవ సభకు తరలివెళ్దాం
- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేసి 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వరంగల్ తరలివెళ్దామని పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గులాబీ అధినేత కేసీఆర్‌యే శ్రీరామరక్షగా నిలుస్తారని.. రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

‘భూ భారతి’తో సత్వర పరిష్కారం

తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ నెల 28న కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూ భారతి చట్టంపై రైతులకు కలెక్టర్ నారాయణరెడ్డి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు

పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం మేడిపల్లి కలాన్ గ్రామానికి చెందిన పత్తి మహేష్ తన సోషల్ మీడియా అకౌంట్లలో పహల్గాం దాడిని ప్రధాని మోదీయే చేపించారని ఆరోపించినట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్, శర్వలింగం, అడెట్ల శ్రీనివాస్, కృష్ణ గౌడ్, ఇంద్రాసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ టీచర్ అవార్డుకు శ్రీనివాస్‌రావు



మొయినాబాద్ రూరల్: ఫార్మసీ టీచర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి గాను జేబీ ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం మెహదీపట్నంలోని జి.పుల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఫార్మసీ నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు ఆయన చెప్పారు. 32 సంవత్సరాలుగా ఫార్మసీ విద్యాబోధనలో దేశవిదేశాల్లో పని చేసిన తాను కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య డాక్టర్ ఎ.రవీందర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీశైలం

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంకాల శ్రీశైలం శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు చేగూరు మీదుగా రాకపోకలు సాగిస్తారని వారితో పాటు గ్రామస్తులకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశానని.. వేసవి ముగిసే వరకు కొనసాగిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీశైలంను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, రాజు, అంజం, భాస్కర్, నరేందర్, సాములయ్య, రాజు, నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ కళాశాల

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శుక్రవారం మూడవ అంతస్తు నిర్మాణ పనులు, ముఖ ద్వారానికి ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో కళాశాలలో అన్ని మౌలిక వసతుల కల్పిస్తున్నామని చెప్పారు. పేదలకు ఉజ్వల భవిష్యత్‌కు దాతల అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కళాశాల భవన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

యువత క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకుల అభిరుచికి అనుగుణంగా క్రికెట్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన శిక్షకులు రంజిత్, డేవిడ్, మురళీకృష్ణ, మతీన్, శివ తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, రఘునాయక్, బస్వం, సుదర్శన్, రాజు, కృష్ణ, నర్సింహ, శ్రీశైలంగౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో కాంగ్రెస్ నాయకుడు మంగఅశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలికేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్‌చైర్మన్ మహ్మద్ లీఖాన్‌బాబర్, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీశైలం, రఘునాయక్, బస్వం, ఎండీ.ఇబ్రహీం, చెన్నయ్య, మోహన్, సుదర్శన్‌గౌడ్, నర్సింలు, యాదగిరియాదవ్, శ్రీనివాస్, రవి, కృష్ణ, ఖదీర్, అశోక్, ముబారక్, గోపాల్‌నాయక్, టీజీ.శ్రీనివాస్, మాణిక్యం, సీతారాం, దర్శన్, సాజిద్, అర్జున్‌లక్ష్మణ్, మంగవెంకటేష్, రమాదేవి, వాసు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఆహ్వానం

కేశంపేట: ఈర నాగమ్మ అమ్మవారి కల్యాణం వచ్చే నెల 15, 16న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్, ఆహ్వానపత్రికలను శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యకు అందజేశారు. ఆరెకటికటల ఆరాధ్య దైవమైన ఈర నాగమ్మ కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలయని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, నాగేశ్వర్, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రావులపల్లి యువకులు

‘గులాబీ’ గూటికి యువత

మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

చేవెళ్ల: మండల పరిధిలోని రావులపల్లికి చెందిన యువకుత శుక్రవారం హైదరాబాద్‌లో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితారెడ్డి వారికి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపనకు కష్టపడి పనిచేయాలని, వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మండల వైద్యాధికారి నిఖిత

కేశంపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనతోనే మలేరియా అంతమవ్వాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నర్సింహారెడ్డి, శేఖర్, పార్వతమ్మ, కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



చందనవెళ్లిలో..

షాబాద్: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని చందనవెళ్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రణీత్ అన్నారు. శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా చందనవెళ్లి గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు పరిసరాలను శుభ్రం ఉంచుకుంటూ దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుందర్‌నాయక్, వైద్య సిబ్బంది కళావతి, నీలరాణి, గోపాల్, సువర్ణ, నవీన్ పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టేందుకే ఉగ్రదాడి

నిరసన ర్యాలీలు చేపట్టిన ముస్లింలు

షాద్‌నగర్: కశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని ముస్లింలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి ఉన్నారని.. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ఉగ్రవాదులు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. హఫీజ్ సయ్యద్ మున్వర్ అలీ, సయ్యద్ అజార్, సయ్యద్ ఇబ్రహీం, బాబర్‌ఖాన్, సర్వర్‌పాషా, జమ్ముద్‌ఖాన్, రబ్‌జామి, జాకీర్‌హుస్సేన్, గౌస్‌జానీ, ముబీన్, ముబారక్, ముస్తాక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

కొత్తూరు: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకుల మృతికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఇన్ముల్‌నర్వలో శుక్రవారం ముస్లింలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉగ్రవాదుల చేతుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. పలువురు మాట్లాడుతూ.. దేశంలో కులమతాల చిచ్చుపెట్టేలా పాకిస్తాన్ యత్నిస్తోందని.. దేశంలో ఇబ్బందులు లేకుండా అన్ని మతాల వారు జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గొడవలతో దేశంలో అలజడులు సృష్టించాలని యత్నిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడానికి అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.

ఉగ్రదాడి దారుణం

మొయినాబాద్‌రూరల్: ఉగ్రదాడి మృతులకు చైతన్య డీమ్డ్ వర్సిటీ అధ్యాపక బృందం, విద్యార్థులు శుక్రవారం నివాళి అర్పించారు. మున్సిపల్ పరిధిలోని చైతన్య డీమ్డ్ వర్సిటీలో కళాశాల చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, విద్యార్థులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్ సువర్ణదేవి, డైరెక్టర్ సాత్వికరెడ్డి, వీసీ శంకర్‌లింగం, రిజిస్ట్రార్ రవీందర్, రాజు, కిష్టఫర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రత్యూష, పవన్‌కుమార్, రాంబాబురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పహల్గాం ఘటన దురదృష్టకరం

చేవెళ్ల: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దురదృష్టకర సంఘటన అని మండల పరిధిలోని ఆలూర్ గ్రామ మైనార్టీలు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత ప్రభుత్వం దీటుగా బదులివ్వాలని డిమాండ్ చేశారు.



కొత్తూరు: ఇన్ముల్‌నర్వలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మొయినాబాద్‌రూరల్: మౌనం పాటిస్తున్న విద్యార్థులు

రజతోత్సవసభను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి, తదితరులు

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులను ఎక్కువ సంఖ్యలో గెలిపించుకొని బీఆర్‌ఎస్ సత్తాను చాటాలన్నారు. కేసీఆర్ ప్రసంగిచే ఈ రజతోత్సవ సభకు రైతులు, ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌యాదవ్, భూపాల్‌రెడ్డి, చాంద్‌పాషా, రాంచంద్రారెడ్డి, గణేష్‌గౌడ్, కుమ్మరి దర్శన్, ఇమ్రాన్, ముఖ్రంఖాన్, సుధాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, రాంమోహన్‌గుప్తా తదితరులున్నారు.

సివిల్ సర్వీసెస్‌లో షాద్‌నగర్ విద్యార్థి సత్తా

విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మనోహర్, నాగమణి దంపతులు

షాద్‌నగర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ జడ్జి మనోహర్, రిటైర్డ్ సీడీపీఓ నాగమణి దంపతుల కుమారుడు భరద్వాజ్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో 905 ర్యాంకును సాధించారు. భరద్వాజ్ 1 నుంచి 10వ తరగతి వరకు పట్టణ సమీపంలోని మరియారాణి శాంతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఈ సందర్భంగా శుక్రవారం భరద్వాజ్ కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. భరద్వాజ్ ప్రస్తుతం ఢిల్లీలో ఇంటలిజెంట్ బ్యూరోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థి భరద్వాజ్ ఉన్నత విద్యను అభ్యసించి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

కద్దాల్: అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామని కద్దాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లాజీ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇటీవల ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ మేరకు సర్వే నంబర్ 8లోని ఓ వెంచర్‌లో అనుమతి లేకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించామని, నిర్మాణం నిలిపివేయాలని నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. ఇదే విషయమై ఠాణాలో ఫిర్యాదు చేశామని చెప్పారు. సరైన పత్రాలతో, పంచాయతి పర్మిషన్ తీసుకున్న తర్వాతే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. నివాసాలు, స్థలం క్రయవిక్రయాల్లోనూ పత్రాలను సరి చూసుకొని ముందడుగు వేయాలని వివరించారు.

ఆయిల్‌పామ్ సాగుకు సబ్సిడీ

మండల ఉద్యాన అధికారి హిమబిందు



సమావేశానికి హాజరైన రైతులు

కేశంపేట: రైతులు పామాయిల్ సాగు చేపట్టి ప్రభుత్వం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన అధికారి హిమబిందు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ.. పామాయిల్ పంటకు చీడపురుగుల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పంట సాగుకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులే కొనుగోలు చేస్తారని వివరించారు. మూడేళ్ల వరకు అంతర పాటల సాగుతో అధిక ఆదాయం ఆర్జించవచ్చన్నారు. పంటలో వైరస్ సోకితే లింగాకర్షక బుట్టలను ఎకరానికి రెండు చొప్పున వాడాలని సూచించారు. ఎకరాకు ఎనిమిది నుంచి 12 టన్నుల దిగుబడిని సాధించవచ్చని అమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, సుధ, నిఖిల్, రాజేశ్వరి, ప్రశాంత్, వాల్యూ అయిల్ కంపెనీ ఫీల్డ్ అధికారి నవీన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ మాడ్గుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్లమెంటు వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్ పై చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, సాయిరెడ్డి, జగన్, నర్సింహ్మా, దళపతి, బాబా, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యం

తుర్కయంజాల్: ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యమని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం తుర్కయంజాల్‌లో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కొత్త కుర్మ శివ కుమార్, రాష్ట్ర సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ దాసు, పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు మంగమ్మ, మాజీ కౌన్సిలర్ సునీల్, నాయకలు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి

గోల్కొండ: హజ్ యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి జరుగుతున్న వాక్సినేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హజ్ యాత్రికులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కానగరంతో పాటు మదీనాలో కూడా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన హజ్ యాత్రికులు ఉంటారన్నారు. పవిత్ర మసీదుల్లో కాలయాపన చేయకుండా తమవెంట ఉన్న హజ్ గైడ్ ఆదేశాలను, సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. తమకు కేటాయించిన గ్రూప్ వారితోనే హజ్‌యాత్ర పూర్తయ్యే వరకు ఉండాలన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, తమ వెంట తెచ్చుకున్న మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. వాక్సినేషన్ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ రాకేష్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆబేద్ బాయ్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్